క్లుప్తంగా

విద్యార్థుల ఉపాధి కల్పనకు కృషి చేయండి : గవర్నర్



గవర్నర్‌తో ఎస్వీయూ ఉన్నతాధికారులు

తిరుపతి సిటీ: తతిరుపతి పర్యటనలో ఉన్న ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వర్సిటీలో బోధన, పరిశోధన రంగాలకు సంబంధించిన ప్రగతిని గవర్నర్‌కు వివరించారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఎస్వీయూ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి, తమ కార్యాలయం నుంచి ఎల్లవేళలా పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారికి ఉపాధి అవకాశాలు కల్పన కోసం పూర్తి స్థాయిలో కృషి చేయాలని వీసీ, రిజిస్ట్రార్‌కు గవర్నర్ సూచించారు.

లయన్స్ క్లబ్ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ప్రతినిధులు

పాకాల: పాకాల మండల ప్లాటినం లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో లయన్స్ క్లబ్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ వి.విజయభాస్కర్ రెడ్డి, ఇండక్షన్ అధికారి డాక్టర్ ఎస్ .రాజారెడ్డి క్లబ్ నూతన సభ్యులు, కళాశాల ప్రిన్సిపల్ ఆర్.రెడ్డిరామరాజు, బి.చంగల్రాయ నాయుడు, పి.జ్యోతి వెంకటరత్నం, టి.నరేష్ చేత ప్రతిజ్ఞ చేయించారు. క్లబ్ నూతన అధ్యక్షుడు కేఎస్. తులసీరామన్ మాట్లాడుతూ, నెలలో మూడు నుంచి ఐదు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామ, ప్రధానంగా విద్య, వైద్య, క్రీడా, మొక్కలు నాటడం ఇత్యాది కార్యక్రమాలను సభ్యుల సహాయ సహకారంతో చేస్తామని ప్రకటించారు. అనంతరం ఎం.కుప్ప స్వామినాయుడు బీటెక్ సెకండియర్ విద్యార్థి ఉదయ్ కుమార్‌కు రూ.10వేల ఆర్థిక సాయం చేశారు. అలాగే, జేఎస్. బాలాజీ తన మనవరాలు పుట్టిన సందర్భంగా 15 మంది విద్యార్థులకు, వారి చిన్నాన్న జె.ఆర్ .కృష్ణమూర్తి ఐదుగురు విద్యార్థులకు యూనిఫామ్ వితరణ చేశారు. లయన్ గురుస్వామినాయుడు, టి.జయరాం నాయుడు, దామోదర్‌నాయుడు, మస్తాన్, జి.రామయ్య, ఆర్‌వీ. ప్రసాద్ అబ్దుల్ ఘని, జీ.వీప్రసాద్, నాగూర్ బాషా పాల్గొన్నారు.

ఆస్పత్రి నిర్మాణం వద్దని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కూరపాటి లేఔట్ వాసులు

తిరుపతి మంగళం : నివాస ప్రాంతాల నడుమ ఆస్పత్రి నిర్మాణం సరికాదని తిరుపతి- కూరపాటి లేఔట్ వాసుల ఆదివారం ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. తిరుపతి-కరకంబాడి మార్గం తిమ్మినాయుడుపాలెంకు ఎదురుగా ఉన్న కూరపాటి లేఔట్‌లో ఆసుపత్రి నిర్మాణానికి పూనుకోవడంతో ఆందోళనకు దిగారు. కూరపాటి రామచంద్రనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కెఎస్. శ్రీనివాస్‌మూర్తి, కృష్ణమూర్తి మాట్లాడారు. తమ లేఔట్‌లో 40 అడుగుల రోడ్లు మాత్రమే ఉన్నాయని, అందులో అంబులెన్సులు, ఇతరత్రా వాహనాలు రాకపోకలు సాగిస్తే ఇక్కడ నివాసిత కుటుంబాలు పలు సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఆస్పత్రి నిర్మాణాలు రోడ్డు పక్కన లేదా 60 అడుగుల రోడ్డు ఉన్న ప్రాంతాల్లో చేసుకోవాలేగానీ ఇళ్ల నడుమ కాదని, ఇక్కడ నిర్మిస్తున్న ఆసుపత్రి నిర్మాణానికి అనుమతులు రద్దు చేసి వెంటనే పనులు నిలుపుదల చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు జయచంద్రనాయుడు, సుధాకర్, వినోద్ కుమార్, స్థానికులు పాల్గొన్నారు.

కల్యాణం..కమనీయం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

తిరుపతి రూరల్: మండలంలోని దుర్గసముద్రంలో నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం భక్తజన సందడి నడుమ ద్రౌపదీదేవి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. తొలుత మూల విరాట్లకు ప్రత్యేకంగా అభిషేక పూజలు చేశారు. మధ్యాహ్నం భాగవతారిణి రాణీరెడ్డి 'ద్రౌపదీ కల్యాణం' ఘట్టాన్ని హరికథాగానం చేశారు. ఆలయ ధర్మకర్త మిట్టపల్లి ప్రసాదరెడ్డి, ఉభయదారులు ఆదెం వెంకటరమణారెడ్డి, భువనేశ్వరి, కమిటీ సభ్యులు నాదముని రెడ్డి, రమేష్ రెడ్డి, జ్యోతిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీపీఐ కార్యదర్శిగా శ్రీరాములు



చంద్రగిరి: మండల సీపీఐ కార్యదర్శిగా ఎస్.శ్రీరాములుతోపాటు 13మందిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మురళి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కమ్యూనిస్టు పార్టీ తొలిసారి చంద్రగిరి మండలంలో ప్రథమ మహాసభ అనంతరం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు ఆయన చెప్పారు.

గుంతలకిడి రామచంద్రా..!





కూరపాటి రామచంద్రనగర్ వద్ద గుంతలమయమైన రోడ్డు

- ఏడాది కాలంగా వినతుల నివేదన
- పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు

తిరుపతి మంగళం : తాము అధికారంలోకి వస్తే సంక్రాంతి నాటికి గుంతల రహిత రహదారులే తమ లక్ష్యమని కూటమి నాయకులు ఆర్భాటంగా ప్రకటించారు. సంక్రాంతి దాటిపోయి 7 నెలలైనా రోడ్ల రోడ్లలో ఎక్కడ ఉన్న గుంతలు మరింత అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ పాలనలో వేసిన రోడ్లు తప్ప ఏడాది కాలంలో చేసిందేమీ లేదు. తిమ్మినాయుడుపాలెం ఎదురుగా ఉన్న కూరపాటి లేఔట్ మార్గంలోని గుంతలమయమైన రోడ్లే దీనికి నిదర్శనంగా నిలిచాయి. వర్షం కురిస్తే చాలు గుంతల్లో నీళ్ల నిలిచి సమస్యలకు స్వాగతం పలుకుతున్నాయి. గుంతల వల్ల మోటార్ సైక్లిస్టులు ప్రమాదాలకు గురవుతున్నారు. పిల్లలను స్కూళ్లకు తీసుకెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కూరపాటి రామచంద్రనగర్‌లో సీసీ రోడ్లు వేయాలని ఏడాది కాలంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులకు, కూటమి నాయకులకు వినతులు ఇస్తున్నా ఏ మాత్రం పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ఇకనైనా అధికారులు ఈ రోడ్ల రూపురేఖలు మారుస్తారా!?

నోటీస్ బోర్డు

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

- **తిరుపతి తుడా:** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, 10.30 నుంచి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు కమిషనర్ మౌర్య ఒక ప్రకటనలో తెలిపారు. ఫోన్ ద్వారా ఫిర్యాదులు చేయదలచిన వారు 0877-2227208 నంబర్‌కు కాల్ చేయాలని తెలియజేశారు.

వాకర్స్‌కు ఉచితంగా శాశ్వత సభ్యత్వం

తిరుపతి కల్చరల్: కరకంబాడి రోడ్డులోని వినాయక సాగర్ నూతనంగా ఏర్పాటైన వినాయక సాగర్ వాకర్స్ క్లబ్ ఆదివారం తమ సభ్యులకు వాకర్స్ ఇంటర్నేషనల్ రీజినల్ కౌన్సిలర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ చేతుల మీదుగా ఉచితంగా శాశ్వత సభ్యత్వంతో పాటు గుర్తింపు కార్డులు పంపిణీ చేసింది. వినాయకసాగర్ వాకర్స్ క్లబ్‌లో ఇప్పటి వరకు 350 మంది సభ్యులకు క్లబ్‌లో సభ్యత్వం కల్పించినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో వినాయకసాగర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సుబ్రమణ్యం రాజు, ఉపాధ్యక్షురాలు శాంతి నాడార్, కార్యదర్శి న్యాయవాది చంద్ర, కోశాధికారి రామసుబ్బారెడ్డి, విజయకుమార్, రాము, హరి, రమేష్, నరసింహారెడ్డి, వరలక్ష్మి, శాంతి, నాగలక్ష్మి, రోజా పాల్గొన్నారు.

పరామర్శ..ఓదార్పు



పెరుమాళ్లపల్లె సర్పంచ్ మోహన్‌ను పరామర్శిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



పెరుమాళ్లపల్లె పంచాయతీ వార్డు సభ్యులు చిట్టెమ్మను పరామర్శిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



భాకరాపేటలో గడ్డం సూరి చిన్నమ్మ రేవతి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆదివారం విస్తృతంగా పర్యటించారు పలువురు పార్టీ నేతల కుటుంబాలను పరామర్శించారు. ఇటీవలే శస్త్ర చికిత్స చేయించుకున్న పెరుమాళ్లపల్లె సర్పంచ్ జోగి మోహన్‌తోపాటు వార్డు సభ్యులు చిట్టెమ్మ, పార్టీ సానుభూతిపరుడు వంశీ, రియల్ ఎస్టేట్ వ్యాపారి చంద్రశేఖర్‌రెడ్డిని పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం చంద్రగిరి మండలం శంకరయ్యగారిపల్లెలో బుచ్చిరెడ్డిగారి గోవింద రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆ తరువాత చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేటలో గడ్డం సూరి చిన్నమ్మ గడ్డం రేవతి మృతి చెందడంతో ఆమె ఇంట జరిగిన కర్మక్రియలకు హాజరై ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఆ తరువాత మండలంలోని పేరూరు పంచాయతీ ఉప సర్పంచ్ పరంధామ రెడ్డి తండ్రి సుబ్రమణ్యంరెడ్డి ప్రథమ వర్ధంతికి హాజరయ్యారు. అలాగే ఎన్టీఆర్ కాలనీలో పార్టీ సానుభూతి పరులు బాల సుబ్రమణ్యం సతీమణి అనిత కర్మక్రియలకు, ముండ్లపూడిలోని శశి తల్లి అంజనమ్మ దశదిన కర్మక్రియలకు హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీలు మూలం చంద్రమోహన్‌రెడ్డి, హేమేంద్రకుమార్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు మునీశ్వరరెడ్డి, శంకరానంద రెడ్డి, తులసీరెడ్డి, వెంకట నారాయణ, లోక, దాము, మురళి, ముండ్లపూడి సర్పంచ్ సూరి, ఉప సర్పంచ్ కుప్పిరెడ్డి, ఎంపీటీసీ వాసురెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, కొత్తపాటి కోటేశ్వరరెడ్డి, సూరి, సిద్ధిక్ బాషా, భాకరాపేట సర్పంచ్ సాకిరి భూపాల్, ఉపసర్పంచ్ ఉమ, భాస్కర్‌రెడ్డి, కొండారెడ్డి, రఘునాథరెడ్డి, శేఖర్‌నాయుడు, పి.రాజశేఖర్, హరినాథ్, గణేష్, నాగప్ప, అరుణ్ కుమార్‌రెడ్డి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజేశ్వరి మృతికి అభినయ్ నివాళి



రాజేశ్వరి భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: తిరుమల వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం మాజీ అధ్యక్షురాలు రజని మాతృమూర్తి వేపాటి రాజేశ్వరి ఆదివారం మృతి చెందారు. ఇది తెలుసుకున్న ఆ పార్టీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి గెస్ట్ లైన్ హోటల్ సమీపంలోని వారి నివాసానికి వెళ్లి రాజేశ్వరి భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అభినయ్‌తో పాటు కార్పొరేటర్ బోకం అనిల్‌కుమార్, పార్టీ గ్రీవెన్స్‌సెల్ నగర అధ్యక్షులు అనిల్‌రెడ్డి తదితరులూ నివాళులర్పించారు.

'ఆస్టర్ నారాయణాద్రి'లో స్పోర్ట్స్ మీట్



రోగులకు జ్ఞాపికను అందజేస్తున్న సీనియర్ ఆర్థోపెడిక్ డాక్టర్ సునందకుమార్ రెడ్డి, ఇతర ప్రముఖులు

తిరుపతి తుడా: ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్‌లో గత ఏడాది మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్స చేసుకున్న రోగులకు ఆదివారం ప్రత్యేకంగా స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. మోకాళ్ల ఆరోగ్యం, శస్త్ర చికిత్స తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడం, రోగులు తిరిగి సాధారణ జీవితానికి ఎలా వస్తారో చాటిచెప్పడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సీనియర్ ఆర్థోపెడిక్ డాక్టర్ వి. సునందకుమార్ రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ, మోకాలి నొప్పులకు నిత్యం మందులను వాడాల్సిన స్థాయికి చేరినప్పుడు మాత్రమే శస్త్ర చికిత్స అవసరమని, వ్యాయామం, వైద్యుల సూచనలతో పలు సమస్యలను తగ్గించుకోవచ్చన్నారు. మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్స తర్వాత తేలిక పాటి వ్యాయామాలు ఎక్కువ కాలం ఫలితాన్నిస్తుందన్నారు. ఈ సందర్భంగా రోగులు శస్త్ర చికిత్సకు ముందు వాళ్ల ఇబ్బందులు, తర్వాత మెరుగుపడిన ఆరోగ్యం గురించి తమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో ఐఎంఏ తిరుపతి అధ్యక్షులు డాక్టర్ రామ్‌నారాయణ్ రెడ్డి, ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ సీఓఓ డాక్టర్ శ్రీధర్‌ముని, సిబ్బంది పాల్గొన్నారు.

నృత్య సమ్మోహనం



భరతనాట్యం చేస్తున్న చిన్నారులు

చంద్రగిరి: తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో వారాంతపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం చిన్నారుల శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు వీక్షకులను సమ్మోహితుల్ని చేశాయి. పలు కీర్తనలు, భక్తి గీతాలు చిన్నారులు సాయిదీక్ష, భావన, గీషణశాన్వి, లక్ష్మీ హన్సిక, జనని, నాగభావన, మోక్షిత నాయుడు, పూర్ణ చంద్రిక, హరీష్‌కేష్, హేమశ్రీ, పావని, ధర్శిక, మోక్ష, గుణశ్రీ, అర్పిత, గుణవర్ధిని, జాన్విక, రోహిత తమ నృత్యం, అభినయం, హావభావాలతో మంత్రముగ్ధుల్ని చేశారు. అనంతరం ఇన‌చార్జ్ ఏఓ సూర్యతేజ కళాకారులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 26 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 85,740 మంది స్వామి వారిని దర్శించుకోగా 35,555 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.41 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

జేసీ ప్రభాకర్‌రెడ్డిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న బీసీ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు గోపాల్

తిరుపతి కల్చరల్: డెప్యూటీ కలెక్టర్ స్థాయి బీసీ అధికారితో దురుసుగా ప్రవర్తించిన తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిపై ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ బీసీ ఉద్యోగుల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు టి.గోపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతపురం జిల్లా పంచాయతీ అధికారి బీసీ వర్గానికి చెందిన నాగరాజు నాయుడుపై జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోనే జేసీ ప్రభాకర్‌రెడ్డి తీవ్రంగా తూలనాడటం, దౌర్జన్యానికి తెగబడటం హేయమని నిరసించారు. దీనిపై ఇకనైనా కూటమి ప్రభుత్వం స్పందించి, చర్యలు తీసుకుని బీసీల ఆత్మగౌరవాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భవిష్యత్తులో కూటమి ప్రభుత్వాని బీసీలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ యాదవ్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గణేష్‌బాబు, వంకీపురం పవన్, కోశాధికారి సునీల్ దత్ పాల్గొన్నారు.

ధ్యానంతో చైతన్యం, ఏకాగ్రత



మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: ప్రతి విద్యార్థి జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలంటే కష్టపడి కాకుండా ఇష్టపడి చదివినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని తిరుపతి పిరమిడ్ స్పిరుచ్యువల్ సొసైటీ అధ్యక్షుడు కంచి రఘురాం అన్నారు. టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన మున్సిపల్ పాఠశాలల విద్యార్థులకు ఆదివారం తిరుపతి అరబిందో సొసైటీ ఆవరణలో బ్రహ్మర్షి పత్రిజీ మెరిట్ స్కాలర్‌షిప్‌లను తిరుపతి డీవైఈఓ కే.బాలాజీ, తిరుపతి టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ బాలిరెడ్డి చేతుల మీదుగా ప్రదానం చేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.3,116, రూ.2,116, రూ.1,116 అందజేశారు. వారు మాట్లాడుతూ, మానసిక చైతన్యానికి, ఏకాగ్రతకు ధ్యానం దోహద పడుతుందన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా ధ్యానం చేస్తే స్థిరచిత్తులుగా ఉంటారని, దేనినైనా సాధించగలిగే నైజం సాధ్యమవుతుందన్నారు. ఒక లక్ష్యం నిర్దేశించుకుని దానిని సాధించి తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అరవిందో సొసైటీ కార్యదర్శి సూర్యనారాయణరెడ్డి, బాలాజీ, కే.ప్రసాద్‌రాజు, డి.ప్రవీణ్‌కుమార్, శాంతి, వనజ, జయరామిరెడ్డి, జయచంద్రాచారి, సుబ్రమణ్యం, అరవిందో సొసైటీ సభ్యులు రామచంద్ర, రవి, యశోద, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన 'టేప్ ఎక్స్‌పో'



బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: తిరుపతి ప్లానర్స్, ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎయిర్ బైపాస్‌రోడ్డులోని పీఎల్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన టేప్ ఎక్స్‌పో ఆదివారం సాయంత్రం ఘనంగా ముగిసింది. ముగింపు కార్యక్రమానికి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్, క్రెడాయ్ తిరుపతి చాప్టర్ అధ్యక్షుడు రాంప్రసాద్, మున్సిపల్ కార్పొరేషన్ డీసీపీ మహబూబ్‌ఖాన్, ఏసీపీ ఇ.బాలాజి, డీసీసీబీ బ్యాంకు చైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. లక్కీ డిప్‌లో ఎంపికైన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, అడ్వాన్స్ టెక్నాలజీతో తయారు చేసిన వివిధ గృహ అలంకరణలు, నిర్మాణ పరికరాలు ప్రజలకు అందుబాటులో తేవడంతో వారికి ఎంతో ఉపయోగకరంగా టేప్ ఎక్స్‌పో దోహపడిందని, ఇలాంటి ప్రదర్శనలను ప్రజలు సద్వినియోగం చేసుకుని వారి సొంతింటి కలను సాకారం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతి ప్లానర్స్ అండ్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, చైర్మన్ టి.వెంకటేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి బి.షణ్ముగం, కోశాధికారి ఇ.సందీప్, ఆర్ ఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అలరించిన 'దుర్యోధన వధ'



దుర్యోధన వధ ఘట్టాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులు

రామచంద్రాపురం: మండలంలోని సి.రామాపురంలో నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత శ్రీధర్మరాజుల మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆఖరి ఘట్టమైన 'దుర్యోధన వధ' ఆదివారం నిర్వహించారు. ఈ ఘట్ట ప్రదర్శనను దుర్యోధనుడు, భీమ వేషధారులు రక్తి కట్టించారు. ప్రదర్శనలో ఉత్తుత్తి యుద్ధమే అయినప్పటికీ రోషావేశాలతో కలియబడుతూ, దుర్యోధన మట్టి ప్రతిమ చుట్టూ గదా యుద్ధంతో తలపడుతూ, పద్యాలాపనతో ఒకరికొకరు సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకుంటూ ప్రేక్షకులను అలరించారు. దుర్యోధనుడి మట్టి ప్రతిమ తొడపై గదతో మోదడంతో దుర్యోధన వేషధారి విరుచుకుపడిపోయి మరణించడం సన్నివేశంతో భారత ప్రదర్శన ముగిసింది. అనంతరం ప్రతిమ మట్టికోసం భక్తులు ఎగబడ్డారు. ఈ మట్టిని పొలంలో చల్లితే పంటలు బాగా పండుతాయని రైతన్నల విశ్వాసం. రాత్రి భక్తులు ఉపవాస దీక్షలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తిరుమలరావు

తిరుపతి కల్చరల్: అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించకుంటే ఉద్యమిస్తామని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుమల రావు స్పష్టం చేశారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో అగ్రి గోల్డ్ బాధితుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ పోరాటం ఫలితంగా కూటమి ప్రభుత్వం అగ్రిగోల్డ్ అంశాన్ని మేనిఫెస్టోలో పెట్టి, అధికారులతో కమిటీలు వేసిందని గుర్తు చేశారు. ఈ సమస్య త్వరితగతిన పరిష్కరించాలంటే స్పెషల్ కోర్టు ఏర్పాటు చేయాలని, అలాగే సీఐడీ అధికారులతో సిట్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం కమిటీలతో కాలయాపన చేస్తే మరోసారి ఆందోళనకు సిద్ధమేనని ప్రకటించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెల్లకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ, ముందు అగ్రిగోల్డ్ కంపెనీ వేసిన రియల్ ఎస్టేట్ వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్లాట్లను అటాచ్‌మెంట్ నుంచి తొలగించాలన్నారు. అలాగే పూర్తి సొమ్ము కట్టిన వారికి వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలన్నారు . ఆగస్టులోపు బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయకపోతే సెప్టెంబర్ 2న ఛలో విజయవాడ పిలుపుతో పోరాటానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు ఉమాశంకర్, వీఆర్.శ్రీనివాస్, మునికృష్ణ, కోటి, హబీబుల్లా, అగ్రి గోల్డ్ బాధితులు పాల్గొన్నారు.

నాటకం..సమాజ చైతన్యం





ప్రథమ బహుమతులు అందుకుంటున్న 'ఆదికవి నన్నయ్యభట్టు', 'రాత' కళాబృందాలు

తిరుపతి కల్చరల్: రంగస్థలంపై నాటకం కళాకారుడి నట వికాసానికి చక్కటి దిక్సూచి వంటిదని, అలాంటి నాటకాలలో రాణించిన ఎందరో సినిమా రంగంలో ప్రముఖ నటులుగా ఎదిగారని ప్రముఖ సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు అన్నారు. అభినయ ఆర్ట్స్ 25వ వార్షికోత్సవంలో భాగంగా మహతి కళాక్షేత్రంలో 9 రోజుల జాతీయ నాటక పోటీలు ఆదివారం రాత్రి ఘనంగా ముగిశాయి. బహుమతి ప్రధానోత్సవంలో ముఖ్య అతిథిగా రేలంగి ప్రసంగించారు. నాటకం సమాజ చైతన్యానికి తోడ్పడుతుందని, నృత్యం భారతీయ సంస్కృతికి దర్పణం పడుతుందన్నారు. బీఎస్.రెడ్డి తొలుత సినీ రంగంలోనూ రాణించి తర్వాత నృత్య, నాటక కళా సంపదలను కాపాడుతూ భావితరాలకు అందించడం అభినందనీయమన్నారు.

పౌరాణిక పద్యనాటకంలో 'ఆదికవి నన్నయ్యభట్టు' ఫస్ట్

పౌరాణిక పద్యనాటకం విభాగంలో విజయనగర్ శ్రీశ్యామలాంబ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ప్రదర్శించిన 'ఆది కవి నన్నయ్యభట్టు' పౌరాణిక పద్యనాటకం, విజయవాడ డాక్టర్ రామన్ ఫౌండేషన్, శ్రీసాయిబాబా నాట్యమండలి ప్రదర్శించిన 'ఖడ్గతిక్కన, మధిర శ్రీసుమిత్ర యూత్ అసోసియేషన్ ప్రదర్శించిన 'యయాతి' పద్యనాటకం ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల విజేతలుగా నిలిచాయి. ఆయా నాటక బృందాలకు వరుసగా రూ.50వేలు, రూ.40 వేలు, రూ.30 వేలతోపాటు హనుమ అవార్డులను ప్రదానం చేశారు.

సాంఘిక నాటికల్లో 'రాత'

అనంతరం సాంఘిక నాటికల పోటీ విభాగంలో ఎన్టీఆర్ జిల్లా వెలుగలేరు శ్రీవెలగలేరు థియేటర్ ఆర్ట్స్ ప్రదర్శించిన 'రాత, కరీంనగర్ చైతన్య కళాభారతి ప్రదర్శించిన 'స్వప్నం రాల్చిన అమృతం', హైదరాబాద్ విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ ప్రదర్శించిన ' స్వేచ్ఛ' ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల విజేతలుగా నిలిచి రూ.25వేలు రూ.20వేలు, రూ.10 వేల నగదు బహుమతులు, హనుమ అవార్డులు అందుకున్నాయి.. అలాగే శాస్త్రీయ, జానపద బృంద నృత్య పోటీల్లోనూ విజేతలకు ఇదే రీతిలో నగదు బహుమతులు, అవార్డులు ప్రదానం చేశారు.కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, విశ్రాంత ప్రిన్సిపాల్లు ఎం.సుధాకర్, డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, సాహితీవేత్త ధర్మయ్య, మున్సిపల్ మాజీ కమిషనర్ మోహన్‌రెడ్డి, విమలాదేవి, మబ్బు సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.